## నేడు సీసీరోడ్ల పనులకు శంకుస్థాపనలు

రాయదుర్గం: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.8.08 కోట్లతో చేపట్టే పనులకు శుక్రవారం శంకుస్థాపనలు చేయనున్నట్లు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొంటారని ఆయన వివరించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లో రూ.2.25 కోట్లతో, కొండాపూర్‌లో రూ.1.64 కోట్లతో, గచ్చిబౌలి డివిజన్‌లో 3.58 కోట్లతో వివిధ కాలనీలు,బస్తీలలో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయాలని నిర్ణయించి శంకుస్థాపనలు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలి

జిన్నారం(పటాన్‌చెరు): జీఓ 59 కింద డబ్బులు చెల్లించిన వారి నివాసాలు క్రమబద్ధీకరించాలని బాధితులు కోరారు. గురువారం తహసీల్దార్ భిక్షపతిని మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, పలువురు కలిసి వినతిపత్రం అందజేశారు. జీఓ 59 నివాసాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసి నిర్దేశిత డబ్బులు కూడా చెల్లించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో వంద, యాభై శాతం డబ్బులను చెల్లించినా నివాసాల క్రమబద్ధీకరణ జరగలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం నివాసాల క్రమబద్ధీకరణ అంశంపై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, ఈ వ్యవహారంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

## షాను కలసిన అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన అంజిరెడ్డి గురువారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ రఘునందన్‌రావులతో కలసి అమిత్‌షాను కలిసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి ఉన్నట్లు తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం శివనగర్ గ్రామంలో టీఎస్‌ఐపాస్‌కు కేటాయించిన స్థలాల్లో కాకుండా ఉప్పరివానికుంట శిఖంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని రైతులు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం గ్రామస్తులు, రైతులు ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, ఎస్సై నాగలక్ష్మి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ కలసి అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టీఎస్ ఐపాస్‌కు కేటాయించిన స్థలాల్లోనే నిర్మాణాలు చేపడుతున్నామని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. రెండు రోజుల్లో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు అధికారులు స్పష్టం చేశారు.

## మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు

పంచాయతీ కార్యదర్శి సుభాష్

పటాన్‌చెరు టౌన్: కూల్చేసిన అక్రమ కట్టడాలను మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఇంద్రేశం గ్రామ పరిధిలో పెట్రోల్ బంక్ సమీపంలో గ్రామ పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులకు మించి భవనం నిర్మిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. అయినా వినకుండా పనులు చేస్తుండటంతో కూల్చివేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతుల మేరకు నిర్మాణాలు చేపట్టాలని కార్యదర్శి సుభాష్ సూచించారు.

## రంజాన్ మాసం పవిత్రమైంది

అల్విన్‌కాలనీ: మూసాపేటలో మోయిజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దవాత్-ఏ-ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని అన్నారు. సోదరభావానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సతీష్ రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అల్విన్‌కాలనీ: మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతూ ఆర్థికంగా స్థిరపడాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం వీరాంజనేయ శివాలయం ఆవరణలోని కమిటీ హాల్‌లో మహిళలను సన్మానించారు. కేకు కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎల్. ఇంద్రసేనా, సీఓ సుజాత, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు మంజుల, పద్మావతి, పాపిరెడ్డినగర్ ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు వి. శోభరాణి, కార్యదర్శి వెంకటలక్ష్మి, కోశాధికారి సౌజన్య, పాపిరెడ్డి నగర్ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పూడిక తొలగించేదెప్పుడు ?



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలోని నాలాలో తీసిన పూడికను అక్కడే వదిలారు. శేరిలింగంపల్లి హైస్కూల్ ముందు భాగంలోని నాలాలో ఉన్న పూడికను వారం రోజుల క్రితం తొలగించారు. తొలగించిన పూడికను గుట్టలుగా పోసి వదిలేశారు. అకాల వర్షాలు కురిస్తే సదరు పూడిక మొత్తం లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కిందకు చేరి డ్రైన్స్‌లో పూడిక చేరే ప్రమాదం ఉందన్నారు. దానిని వెంటనే తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– శేరిలింగంపల్లి





# నేటి నుంచి టెన్త్ పరీక్షలు



విద్య హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎంఈఓ వెంకటయ్య తదితరులు

- శేరిలింగంపల్లి మండల పరిధిలో 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలకు హాజరు కానున్న 6090 మంది విద్యార్థులు
- పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈఓ వెంకటయ్య

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు ఆయా కేంద్రాల ఛీప్ సూపరింటెండెంట్‌లు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని 28 పరీక్షా కేంద్రాల్లో 6090 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో తరగతి గదుల్లో హాల్‌టికెట్ నంబర్ వారీగా నంబరింగ్ వేస్తున్నారు. అదే విధంగా ఫ్యాన్లు, మంచి నీటి వసతి, టాయిలెట్లు ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈఓ వెంకటయ్య...**

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి జిల్లా పరిషత్ హైస్కూల్, విద్య హైస్కూల్, హఫీజ్‌పేట్‌లోని విజ్‌డమ్ గ్రామర్ స్కూల్, యునైటెడ్ హైస్కూల్, హోలీ ఫాతిమా స్కూల్ సెంటర్‌లలో ఏర్పాట్లను ఎంఈఓ ఎస్.వెంకటయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇప్పటికే అన్ని కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించానని తెలిపారు.



శేరిలింగంపల్లి హైస్కూల్‌లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయురాలు

## తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం కోచ్‌లు, క్రీడాకారులతో పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.465కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడారంగాన్ని బలోపేతం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. నూతన స్టేడియాల నిర్మాణం, స్టేడియాల ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. గతేడాది బడ్జెట్‌లో క్రీడలకు రూ.364 కోట్లు పెట్టగా ఈ ఏడాది రూ.465కోట్లు కేటాయించడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కె మధు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి స్టేడియంలో మాట్లాడుతున్న శివసేనారెడ్డి

## ఐటీఎఫ్‌ఎల్, మిసెస్‌ఇండియా ఫ్యాషన్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

రాయదుర్గం: భారతదేశంలో మొట్టమొదటిసారిగా మాతృమూర్తులు, పిల్లలకు కలిపి ఫ్యాషన్ ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సమాన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్(ఎస్‌సీడీఎస్), విబ్జార్ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ భారీ ఫ్యాషన్ ఈవెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఇండియా టీన్స్ ఫ్యాషన్ లీగ్(ఐటీఎఫ్‌ఎల్), మిసెస్ ఇండియా ఫ్యాషన్ పోటీని దేశ వ్యాప్తంగా ఉన్న ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యా కేంద్రాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. అంతేకాకుండా ఫినాలే పోటీలను మే నెలలో హైదరాబాద్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్స్ సంస్థల ప్రతినిధులు సుచరిత, మనోవట్వర్ధన్, అభిషేక్ అగర్వాల్, ప్రీతి అగర్వాల్, ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలోని'మనూ'లో బ్రోచర్‌ను ఆవిష్కరించిన నిర్వాహకులు

## దశలవారీగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తాం



గోపన్‌పల్లితాండలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయదుర్గం: దశలవారీగా పేదలు నివాసముండే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలోని సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ మంజుల తెలిపారు. గోపన్‌పల్లితాండలో సంపూర్ణ సురక్ష కేంద్రం, కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడుతూ... ప్రజలందరిలో ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడంతో పాటు వైద్య పరీక్షలను నిర్వహించి తగిన సలహాలు అందించామని అన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామన్నారు. ఆరోగ్యం కోసం తగిన జాగ్రత్తలను అందరూ పాటించాలన్నారు. కొండాపూర్ ఆస్పత్రి వైద్యుల ఆదేశంపై ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు గోపన్‌పల్లి తాండలో బీపీ, షుగర్, వీడీఆర్‌ఎల్, హెచ్‌ఐవీ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలను చేయించుకున్నారని తెలిపారు. వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బస్తీ దవాఖానా డాక్టర్ ధీరజ్, ఏఎన్‌ఎం స్వాతి, ఆశ బేబీ, లక్ష్మీ, కేంద్రం ఔట్‌రీచ్ వర్కర్ అఖిల, కొండాపూర్ ఐసీటీసీ కౌన్సిలర్ శైలజ, పీపీటీసీటీ కౌన్సిలర్ స్వరూప, స్థానికులు పాల్గొన్నారు.

**ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...**

చందానగర్ : చందానగర్‌లోని హుడా కాలనీలోని శిరిడి సాయిబాబా ఆలయ ఆవరణలో చందానగర్ మెడికవర్ హాస్పటల్స్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆదిత్య, శ్రీ తేజ, నజీర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానం, నడక, కనీసం 40 నిమిషాల పాటు చేయాలన్నారు. ఈ శిబిరంలో 102 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు శ్రీనివాసరావు, రామిరెడ్డి, రాజయ్య, సిద్ధిరాములు, శ్రీనివాస నాయక్, కిషోర్ బాబు, అసోసియేషన్ సభ్యులు పాలం శ్రీనివాస్, శివరామిరెడ్డి, బాలరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 23న ముదిరాజ్‌ల సమరభేరి సభ

రాయదుర్గం: ముదిరాజ్‌ల ఐక్యత, హక్కుల సాధన ప్రధాన ఎజెండగా సమరభేరి సభను ఈనెల 23న నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11గంటలకు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని హాల్‌లో నిర్వహించాలని తలపెట్టారు. ముదిరాజ్‌ల రిజర్వేషన్లు, ప్రభుత్వంలో మన వాటా కోసం ముదిరాజ్ శక్తిని చాటేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఎంపీ ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



రాయదుర్గం: మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ నాయకత్వంలో శేరిలింగంపల్లి నాయకులు కలిశారు. ఈటల రాజేందర్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయనను శాలువాతో సత్కరించి పూలమాలను వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వసంతకుమార్‌యాదవ్, వెంకటస్వామిరెడ్డి, నర్సింహచారి, యాదవరెడ్డి, లక్ష్మణ్‌ముదిరాజ్, గణేష్‌ముదిరాజ్, రాయల్, సత్యనారాయన, శివరాజ్, విజేందర్, పట్టాభిరామ్, ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పార్కు అభివృద్ధి పనులు గురువారం కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులోని పలు పనులకు కాలనీవాసులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యత లోపించకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

## జెడ్పీహెచ్‌ఎస్ సందర్శించిన ఎన్‌సీఈఆర్‌టీ మైసూర్ బృందం

రాయదుర్గం: జాతీయ విద్యాపరిశోధనా శిక్షణా సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) ఢిల్లీ, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్‌ఐఈ) మైసూర్‌కు చెందిన బృందం గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఢిల్లీ ఎన్‌సీఈఆర్‌టీ అధికారులు డాక్టర్ విజయన్, డాక్టర్ శిల్ప, మైసూర్ అధికారులు వి.చంద్రన్న, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ కె.సురేష్‌కుమార్‌తో కూడిన బృందం నాణ్యమైన బోధన, మౌలిక వసతులు, ఇతర అంశాలను పరిశీలించి ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే తాజ్‌బాబుతో సమావేశమయ్యారు. పలు అంశాలను ఆయనను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల పరిస్థితి, కొత్తగా చేపడుతున్న నిర్మాణాలు, పాఠశాల ఆవరణలో పరిస్థితులు, మల్టీపర్పస్ హాల్‌ను కూడా వారు పరిశీలించారు.

◆ పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధన కోసం తీసుకున్న చర్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ ఇన్షియేటీవ్ ఫర్ స్కూల్ హెడ్స్ అండ్ టీచర్స్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఈ కార్యక్రమంపై అధ్యయనం చేయడానికి బృంద సభ్యులు పాఠశాల ఉపాధ్యాయుల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను కూడా వారు తీసుకోవడానికి పర్యటించారు. పాఠశాల స్థాయిలో అమలు అవుతున్న వివిధ కార్యక్రమాలను వివరాలను కూడా హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీఈఆర్‌టీ, ఆర్‌ఐఈ అధికారుల బృందం

## 'ఇక గోకుల్‌ప్లాట్స్‌కు బస్ సర్వీస్'

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీకి నూతనంగా ఆర్టీసీ బస్ సర్వీస్‌లను గురువారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత కాలంగా గోకుల్‌ప్లాట్స్ కాలనీవాసులు కోరుకున్న విధంగా బస్ సర్వీస్‌ను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమన్నారు. గోకుల్ ప్లాట్స్ నుంచి సికింద్రాబాద్, మెహిదీపట్నం వరకు సర్వీసులు నడుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.




బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

## 'మెడికవర్'లో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం



మాదాపూర్: నోటి శుభ్రత బాగుంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కేఎం రాధాకృష్ణ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అనాథ పిల్లలకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోటిలో దంతాలు ఎంత పరిశుభ్రంగా ఉంటాయో తాము కూడా అంత మంచి స్వరాలను పలికించగలుగుతామని తెలిపారు. డాక్టర్ శరత్‌బాబు మాట్లాడుతూ... నోటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని తెలిపారు. ఏదైన తిన్న తరువాత నోటిని కడుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్‌హెడ్ శ్రీకాంత్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాలో ఆకస్మిక తనిఖీలు

మాదాపూర్: మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని బస్తీ దవాఖానాలో అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలను చేశారు. శేరిలింగంపల్లి జిల్లా వైద్యా, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.సుధాకర్ లాల్ దవాఖానాను పరిశీలించారు. అనంతరం అక్కడి వారికి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు నిర్వహించే రికార్డులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని కోరారు.



## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాయదుర్గం: అనుమానాస్పద పరిస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మసీదుబండ కొండాపూర్ అంబేద్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన పెంద్యాల రాజు(35) కూలిపని చేసుకొని జీవిస్తున్నాడు. భార్య లవని, ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటున్నారు. కొంత కాలంగా రాజు మద్యానికి బానిస అయి కూలి పనులకు సైతం వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం భార్య లవని ఇద్దరు కుమారులను తీసుకొని పటాన్‌చెరు చిట్కూల్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంటి వద్దే ఉంటున్న రాజును గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై తీసుకొచ్చి బుధవారం రాత్రి ఇంటి దగ్గర అరుగుపై కూర్చోబెట్టి వెళ్లాడు. తెల్లవారుజామున రాజు విగతజీవిగా పడి ఉన్నట్లుగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు రాజు మేనల్లుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రాజు సహజంగా చనిపోయాడా.? లేక ఎవరైనా గాయపరిచారా.? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రాజు ఒంటిపై స్వల్ప గాయాలు ఉన్నాయని, ఎక్కడైనా పడి గాయాలు అయ్యాయా.? లేక ఎవరైనా గాయపరిచారా..? అనే విషయాలు విచారణలో తేలాల్సి ఉంది.



రాజు (ఫైల్)

# నిబంధనలు పాటించాల్సిందే.. హెల్మెట్ ధరించాల్సిందే.!

- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డా. గజరావు భూపాల్
- గచ్చిబౌలిలోని అరేటే ఆస్పత్రిలో వరల్డ్ హెడ్ ఇంజ్యూరీ డే

చందానగర్: రోడ్డు ప్రమాదాలు నివారించడానికి హెల్మెట్ ధరించడం ఎంతో అవసరమని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డాక్టర్ గజరావు భూపాల్ పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని అరేటే హాస్పిటల్‌లో వరల్డ్ హెడ్ ఇంజ్యూరీ డే అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు నివారించడంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనుకోకుండా ప్రమాదం జరిగితే ప్రాణాలు కాపాడుకోవడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమించడంతో పాదచారులు రోడ్డుపై వెళ్తుంటే ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డుపై కార్లు, ద్విచక్రవాహనాలు వారికి కేటాయించిన లేన్‌లలోనే వెళ్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు.

**రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత, మద్యం సేవించిన వారే..**

అనంతరం అరేటే ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు తల గాయాలకు ప్రధాన కారణంగా మారాయన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా చాలా ప్రమాదాల నుంచి బయట పడొచ్చని అన్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల గాయాల వల్ల జీవితాలను మారుస్తాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత, మద్యం సేవించిన వారే ఉన్నారని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.




హెల్మెట్‌లను పంపిణీ చేస్తున్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డాక్టర్ గజరావు భూపాల్

**హెల్మెట్‌ల పంపిణీ..**

ప్రజాసేవలో అరేటే హాస్పటల్ ముందుంటుందని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో మార్పు తీసుకురావాలనే తమ దృఢ నిశ్చయానికి నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని అవగాహన కార్యక్రమాల ద్వారా తాము భద్రత సంస్కృతిని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది, విలేకరులకు హెల్మెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామకృష్ణ చౌదరి, డాక్టర్ రవీశ్ సుంకర, డాక్టర్ పవన్ కుమార్, వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.